## 1. చెలగాటం

షేక్స్పియరూ, శ్రీకృష్ణుడూ
జీవితం ఓ నాటకం అన్నారు
నాకు మాత్రం
ప్లాటర్థం కాక
రూల్సు లేని ఆటలా ఉంది.

అందుకే ఆడుతున్నాను
ఎదటివారి ఎత్తుల్ని
అఫెన్సో డిఫెన్సో
అంతమాత్రాన
నా వ్యక్తిత్వానికేమిటి లోపం?

## 2. దృష్టిదోషం

తెలుగువారికి అఖ్కర్లేని సంగతి లేదు
ఎల్లరి బతుకులూ బజారుపాలు
ప్రతివాడికీ పొరుగువాడి గొడవే
అని మా నమ్మకం

ఇండియా మారిపోయింది
ఇప్పుడెందుకెళ్ళడం
పూర్వపు అభిమానాల్లేవంటూ
వారించిన మిత్రుల్నీ , శ్రేయోభిలాషుల్నీ
కాదు, కాదని,
ఆకార విశేషాల్లో
నేను మారేనని ప్రకటించుకుంటూ
ప్లేను దిగిన నన్ను

ఆప్యాయంగా ఆదరించిన
బంధుమిత్రుల్ని చూసి
ఆనందాతిరేకంతో
అవాక్కయిపోయాను

ఏంజరిగిందేం జరిగిందంటూ
జనం పొడుచుకు తిన్లేదని
ఉప్పొంగిపోయాను.

తీరిగ్గా
తరిచ్చూసుకుంటే
ఇప్పుడనిపిస్తోంది
నాగతం గురించెవరూ
ప్రశ్నించలేదని
అప్పుడానందించేను.
ప్రస్తుతం
నాకెలా గడుస్తోందని
ఎవరూ అడగలేదని
ఇప్పుడు కొరతగా ఉంది!

## 3. తెనుగు నుడికారం

పాలవాడుకలా
వారాలబ్బాయిలా
క్రమం తప్పకుండా
''హలో'' చెప్పడానికో
''డైనింగవుటు''కో
''డూయింగ్‌లంచి''కో
కాల్చేసి, కబుర్లాడి,
ఓకేనండంటూ
కట్టేసీ కాలులు ముగించేసే
మిత్రబృందానిక్కరువు లేదిక్కడ

కాని
''అమ్మ దొంగా'' అంటూ అలరించి
హుందాతనం ఒలకబోస్తూ
''కొడుకు, కోడలి'' ముచ్చట్లు,
''మన'' చేతుల్లో మడుసులూ
''కోప్పడేసే'' మినిష్టర్ల గొడవలూ
--లాటి
వూసులాడుకోడానికి
''మనాళ్లు'' కావాలంటే మాత్తరం
అంజనంవేసి చూసుకోవాల!

(3కవితలు ఆంధ్రప్రభ, 15 సెప్టెంబరు 1997 లో ప్రచురితం)

★★★

## కొడక్ క్షణాలు

పక్కలేనులో
డెబ్భై మైళ్ల స్పీడుతో
దూసుకుపోయే కారులోంచి
దేశవాళీ పసిపాప
''మామీ'' అంటూ
వేలెత్తి చూపిన సుందర దృశ్యం

పూజక్కాదు కాని
భోజనానికొస్తాననే
కాలేజీ కుర్రాడి హుషారు

మీయింటికొస్తే
అమ్మ గారింటికొచ్చినట్టుంటుందనే
కొత్త పెళ్లికూతురి
వదనంలో నిర్వేదం

పట్టుచీరలో
పండుతలతో
మౌనంగా నిలబడిన
ముత్తైదువుని
ఎత్తుకోమంటూ చేతులు చాచిన
బుల్లిపాపాయి

కోల్స్‌లో
క్యూలో
తెలుగుయాస విని
చప్పున విప్పారిన
అక్షిద్వయం

ఫోన్‌బుక్కు తీసి
రాజుగారినీ
రెడ్డిగారినీ
శాస్త్రి గారినీ
శర్మగారినీ
పిలిచేసే కొత్త మాష్టారు

అమెరికా ఖండాన
అనుదినమెదురయే
మధుర క్షణాలు!
అంతరాంతరాల
మణగిన ఆర్తికి ఆదర్శాలు (మార్చి 2002)